క్లుప్తంగా

నిబంధనల ప్రకారం గ్రామాభివృద్ధి ప్రణాళికలు

పెదపూడి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నిబంధనల ప్రకారం పరిశీలన చేయించి, అవసరమైతే సవరణలు చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం బృందం మండలంలోని 18 గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించింది. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 2023–2024 సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన ప్రణాళికలు ఏమైనా మార్పులు చేర్పులుంటే, ఆన్‌లైన్‌లో నిబంధనల ప్రకారం చేపట్టాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఆ బృందం పరిశీలన చేపట్టింది. కార్యక్రమంలో బృంద ప్రతినిధులు భైరవమూర్తి, సుధారాణి, సత్యనారాయణ, నాగేంద్ర, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, అచ్చిరాజు, ఉమామహేశ్వరరావు, త్రినాథ్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో సహకార సంఘం



వంగలపూడి సహకార సంఘ భవనం

రాజానగరం: సీతానగరం మండలం వంగలపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తోందని చైర్ పర్సన్ శివకుమార్ అన్నారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికయ్యే సమయానికి ఈ సంఘం టర్నోవర్ రూ.రెండు కోట్లు మాత్రమే ఉండేదని, దానిని ప్రస్తుతం రూ.30 కోట్లకు పెంచామన్నారు. పక్కా భవనాల నిర్మాణానికి రూ. 10 లక్షలు సొంత విరాళంతో పాటు సంఘంలోని క్రిఫ్టి నిధులను వినియోగించామని తెలిపారు. మండలంలో కొన్ని సహకార సంఘాలతో పాటు తమ సంఘానికి కూడా ఐటీడీఏ నిధులు (వడ్డీతో తిరిగి చెల్లించవలసి ఉన్నందున) మంజూరైనా గాని ఆ నిధులను తీసుకోకుండానే పక్కా భవనాలు నిర్మించామన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

సీతానగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ముగ్గళ్లలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మట్టాడి వెంకట రమణ మాట్లాడుతూ ఆదివారం అంబేడ్కర్ జయంతిని పండగలా నిర్వహిస్తామన్నారు. ఆరోజు బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, డీజీ పీవీ సునీల్ కుమార్ ర్యాలీలో పాల్గొంటారన్నారు. దళిత నాయకుడు దాసి వెంకట్రావు ఆధ్వర్యంలో జయంతి రోజు మండల వ్యాప్తంగా ముగ్గళ్లలో భోజనం ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

ఈలకొలనులో వైఎస్సార్ సీపీలో చేరికలు


ఈలకొలనులో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈలకొలను గ్రామంలో టీడీపీకి చెందిన కడిమి వెంకటేశ్వరరావు, కడియపు విష్ణు, పల్లేటి నాగేశ్వరరావు, ఎల్లే సుదర్శన్, గుత్తుల గోవిందు, నల్లమిల్లి వీరబాబు, లంక గోవిందు, పల్లేటి శేఖర్, కొత్తపల్లి ముసలయ్య, కొత్తపల్లి రాజారావు, కొత్తపల్లి అబ్బులు, తిక్కిశెట్టి సూరిబాబు, కమిలి నూకరాజు, పల్లేటి అబ్బులు, ఎల్లే వెంకటేశులు తదితరులు స్థానిక జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు సీతారామ అగ్రహారంలోని అభీష్ట గణపతి పంచాయతన దేవాలయంలో శుక్రవారం కల్యాణ కార్తికేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా జరిగింది. అభీష్ట గణపతి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా తంగిరాల భాస్కర సుబ్రహ్మణ్యశర్మ సోమయాజులు ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. తంగిరాల భార్గవశర్మ దంపతులు స్వచ్ఛంద రుత్విక్కులు దేవరకొండ లక్ష్మీనరసింహశాస్త్రి, తంగిరాల గణేశ శర్మ, నరసింహశర్మ తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. పిడపర్తి శివరామశర్మ అవధానులు, ఆహితాగ్నులు బ్రహ్మశ్రీ దేవరకొండ వీర వెంకట సత్యనారాయణమూర్తి సోమయాజులు, తంగిరాల మల్లికార్జునశర్మ సోమయాజులు పాల్గొన్నారు.

ప్రజలందరూ జగన్‌కు పట్టం కట్టండి


రామేశ్వరంలో స్కూటర్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్

- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి ఎన్నికల ప్రచారం
- పెదపూడి మండలంలో మహా మోటార్ బైక్ ర్యాలీ

పెదపూడి: రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలో రామేశ్వరం నుంచి జి.మామిడాడ వరకు శుక్రవారం వైఎస్సార్ సీపీ మహా మోటార్‌బైక్ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి గూడూరి శ్రీనివాసు ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముందుగా జి.మామిడాడలోని సూర్యనారాయణ మూర్తి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రామేశ్వరంలో ప్రారంభమైన ర్యాలీ.. ఏపీత్రయం, కరకుదురు, దోమాడ, పెదపూడి, కైకవోలు, శహపురం, కాండ్రేగుల, సంపర, పుట్టకొండ, గండ్రేడు, పెద్దాడ గ్రామాల మీదుగా సాగి, తిరిగి జి.మామిడాడకు చేరింది. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ర్యాలీలో అడుగడుగునా మహిళలు హారతులిచ్చారు. శాలువాలు, పూలమాలలు వేసి, పూలవర్షం కురిపించి బ్రహ్మరథం పట్టారు. రామేశ్వరం, పెదపూడి, జి.మామిడాడ గ్రామాల్లో క్రేన్ల సహాయంతో భారీ గజమాలలు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సత్కరించారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డివైపే ఉన్నారన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో సుమారు 99 శాతం అమలు చేసిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు.

రాష్ట్రంలో జగన్ ప్రభంజనం

ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ ప్రభంజనం సృష్టించారన్నారు. మళ్లీ అత్యధిక సీట్లతో ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. పేదవారి సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పప్పు సింహాచలం, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సుందరపల్లి సుధాకర్‌బాబు, పార్టీ నేతలు చింతా దొరబాబు, గుత్తుల రమణ, సాంబత్తుల చంటి, కోసూరి వాసు, ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, కొల్లు పెద్దకాపు, సొసైటీల చైర్మన్లు గుండా ఈశ్వరరావు, మార్ని కామరాజు చౌదరి, మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గా ప్రసాద్, మండల అబ్జర్వర్ కోనాల శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

గణితంలో మూర్తికి పీహెచ్‌డీ


మూర్తికి పీహెచ్‌డీని అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ డీవీఎస్ఎస్ఆర్ మూర్తికి వీసీ ఆచార్య కె.పద్మరాజు గణిత శాస్త్రంలో పీహెచ్‌డీని పట్టాను అందజేశారు. డాక్టర్ సీహెచ్. శ్రీనివాసులు పర్యవేక్షణలో కెల్లర్ బాక్స్ పద్ధతిని ఉపయోగించి రసాయనిక ప్రతిచర్యలతో వివిధ రకాల ఐదు నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్స్‌పై సంఖ్యాత్మక విశ్లేషణ అనే అంశంపై పరిశోధన చేశారు. క్యాన్సర్ కణాలను నిర్ధారించడానికి, మూత్ర పిండాలలో రోగ నిర్ధారణకు ఈ పరిశోధన బాగా ఉపయోగపడుతుందని డాక్టర్ శ్రీనివాసులు, హెచ్ఓడీ డాక్టర్ టి.హైమవతి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

సీతానగరం: వంగలపూడికి చెందిన 31 ఏళ్ల పుట్టగంటి విజయలక్ష్మి అదృశ్యమైన ఘటనపై ఆమె భర్త ఉత్తమ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం కేసు నమోదు చేశారు. విజయలక్ష్మి ఈ నెల 6న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంతవరకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అత్యధిక మెజార్టీ సాధనే ధ్యేయం


కోరుకొండలో ఎమ్మెల్యే రాజాను శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

- చేసిన మేలును ప్రజలకు తెలపండి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజార్టీని సాధించే దిశగా ఎన్నికల ప్రచారం సాగించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన శుక్రవారం కోరుకొండలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు ముఖ్యనేతలను కలిశారు. అలాగే పార్టీ సీనియర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాను శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వచ్చేది మన ప్రభుత్వమేనని సమన్వయంతో చురుగ్గా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హతే ప్రమాణంగా సంక్షేమ పథకాలను అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాజానగరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్–1 గా తీర్చిదిద్దినట్టు తెలిపారు. పల్లెలన్నీ ప్రగతి పథంలో నడుస్తున్నట్టు తెలిపారు. రూ.1,773 కోట్లతో అభివృద్ధి, 1,377 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అలాగే నియోజకవర్గంలో సొంతిల్లు లేని 20,200 మంది పేదలకు స్థలాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ
- జోరుగా ఎన్నికల ప్రచారం

సీతానగరం: వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు సీలింగ్ ఫ్యాన్‌పై ఓటు వేసి, జగన్ సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ కోరారు. ఆమె శుక్రవారం సీతానగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఒక్క సెంటు భూమి కూడా ఇంటి స్థలంగా అందించ లేదని, వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించారని గుర్తు చేశారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారన్నారు. ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జక్కంపూడి కుటుంబమంతా ప్రజా సేవలో నిమగ్నమయ్యారన్నారు. రాబోయే ఎన్నికలలో ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఎంపీటీసీ వెన్నెల అప్పల నాయుడు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు, వలవల సత్తిబాబు, వలవల వల్లీ, సలాది వాసు, పైల మురళీకృష్ణ, మట్టా శ్రీను పాల్గొన్నారు.


సీతానగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

ఇంటర్ ఫలితాల్లో 'ప్రభుత్వ' విద్యార్థుల ప్రతిభ


సీతాశ్రావ్య, వీర హాసిని, లీలా శ్రావణి, పాలమూరి దేవి, కర్రి కీర్తన, జి.రిబ్కాగ్రేస్

రంగంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు చదువులో సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాలను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ వివరించారు. ఇంటర్ సెకండియర్‌లో మొత్తం 91 మంది విద్యార్థులకు గాను 51 మంది ఉత్తీర్ణులై 56 శాతం, ఫస్టియర్‌లో 40 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో సెకండియర్ విద్యార్థిని ఎ.సీతాశ్రావ్య ఎంపీసీలో వెయ్యికి 940 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. జి.రమ్యశ్రీ బైపీసీ 938, ఎంపీవీ బాలాజీ సీఈసీలో 865, కె.వీరవెంకటలక్ష్మి హెచ్ఈసీలో 859 సాధించారని చెప్పారు. ఫస్టియర్‌లో ఎన్.వీరహాసిని ఎంపీసీలో 470కు 446, సీహెచ్ మాధవి బైపీసీలో 415, ఏవీ దుర్గాప్రసాద్ సీఈసీలో 432, డి.సోహిత హెచ్ఈసీలో 446 మార్కులు సాధించినట్టు తెలిపారు.

పందలపాక కళాశాలలో..

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఉన్న శ్రీపడాల పెదపుల్లా రెడ్డి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాల ఇంటర్ విద్యార్థులు సత్తా చాటారు. ఫస్టియర్ ఎంపీసీలో పోలమూరి దేవి 470కు 439, సీఈసీలో ఆర్.లీలా శ్రావణి 500కు 479, సెకండియర్ సీఈసీలో కర్రి కీర్తన 878, ఎంపీసీలో జి.రిబ్కాగ్రేస్ 654 మార్కులు సాధించారు.

రాజబాబు కళాశాల విద్యార్థుల ప్రతిభ

మధురపూడి: కోరుకొండ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు 59 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్, ఆర్‌జేడీ ఐ.శారద, ఇన్‌చార్జి ఎస్.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరానికి చెందిన 107 మందికి 64 మంది, మొదటి సంవత్సరంలో 168 మందికి 74 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో ఎస్.గౌరీ శంకర్ 1000కి 964 మార్కులు, సీఈసీలో పి.భవాని, సి.సత్య 1,000కి 906 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం సీఈసీలో జి.ధనలక్ష్మి 470కి 438 మార్కులు సాధించిందన్నారు.

75 శాతం ఉత్తీర్ణత

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సెకండియర్ విద్యార్థులు (జనరల్, ఒకేషనల్) 75 శాతం ఉత్తీర్ణత సాధించారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు శుక్రవారం తెలిపారు. సీనియర్ ఎంపీసీ విద్యార్థులు 11 మందికి 8 మంది, బైపీసీలో 33 మందికి గాను 25 మంది, సీఈసీలో 16 మందికి గాను 16 మంది, ఒకేషనల్‌లో ఓఏలో 9 మందికి ఇద్దరు, ఎంఅండ్ ఏటీలో పది మందికి ఆరుగురు, సీఈటీలో 8 మందికి అందరూ ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పి.ధర్మరాజు 939, సీహెచ్ ప్రశాంతి 895 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో 107 మందికి 47 మంది విద్యార్థులు (44 శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు.

వైఎస్సార్ సీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

రంగంపేట: వైఎస్సార్ సీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు అని, ప్రతి ఒక్కరినీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని మర్రిపూడి గ్రామంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఎంపీపీ దంపతులు రిమ్మలపూడి శ్రీదేవి, వెంకటేశ్వరరావు, సర్పంచ్ దంపతులు వేము మాధవి, చిరంజీవి, పార్టీ నాయకులు కలిసి ఆదిలక్ష్మికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు ఆ పార్టీ వారికే దక్కేవని, నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. మరొక్కసారి వైఎస్సార్ సీపీకి ఓటేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఆదిలక్ష్మి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మేడిది చక్రం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మర్రిపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదిలక్ష్మి

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: మంచినీటి చెరువు వద్ద ఉన్న గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం, కల్యాణం శనివారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తెలిపారు.

జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందాం

సీతానగరం: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేద్దాం, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం అని చీపురుపల్లిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ గోపిశెట్టి సత్య అనురాధ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మన్నెల్లి మరియ్యమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నెల్లి వెంకట్రావు తదితరులు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాలను గెలిపించాలని కోరారు. చంద్రబాబు హామీలను నమ్మవద్దని, ఓట్ల కోసమే ప్రజలను ఆయన ప్రలోభపెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి తులసీరామ్, ఉడితే పార్వతి, బుక్కె లక్ష్మి, కోన చక్రం, ముదునూరి రామకృష్ణంరాజు, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.


చీపురుపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

అనపర్తి: మండలంలోని రామవరం, పెడపర్తి గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 52 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రామవరం గ్రామ సచివాలయం 1, 2 పరిధిలోని 37 మంది, పెడపర్తి గ్రామ పరిధిలోని 15 మంది వలంటీర్లు రాజీనామా చేసి, రాజీనామా పత్రాలను ఆయా గ్రామ సచివాలయం కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందేలా బాధ్యతగా పనిచేస్తున్నామన్నారు. సేవాభావంతో, నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న తమను కించపరుస్తూ, నిందలు వేసిన కూటమి నేతల వైఖరికి నిరసనగా రాజీనామాలు చేసినట్టు తెలిపారు.

టీడీపీ నేతల దుర్భాషలు సహించం

బిక్కవోలు: టీడీపీ నేతలు ఇష్టానుసారంగా తమను దూషిస్తే సహించేది లేదని వలంటీర్లు హెచ్చరించారు. వైఎస్సార్ సీపీని రాజకీయంగా ఎదుర్కోలేక, తమను వేధింపులకు గురిచేస్తుండడానికి నిరసనగా తాము రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారు. శుక్రవారం బిక్కవోలు మండలంలోని బిక్కవోలు సచివాలయం–4 పరిధిలో 19 మంది వలంటీర్లు రాజీనామా చేసి, ఆ పత్రాలను సచివాలయ కార్యదర్శికి అందించారు.

60 మంది వలంటీర్ల రాజీనామా

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 60 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. ముగ్గళ్లలో 16 మంది, కాటవరం ముగ్గురు, ములకల్లంకలో ముగ్గురు, మిర్తిపాడు 16 మంది, రఘుదేవపురం– 1 పరిధిలో ముగ్గురు, రఘుదేవపురం –2 పరిధిలో 11 మంది, ఉండేశ్వరపురంలో 11 మంది తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌కు అందించారు. వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామాలు చేసినట్టు తెలిపారు.


పెడపర్తిలో రాజీనామాలు చేసిన వలంటీర్లు


రామవరంలో రాజీనామాలు చూపుతున్న వలంటీర్లు


బిక్కవోలులో రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు

రాజానగరంలో అభివృద్ధి కనిపించలేదా!


దూలం పెద్ద

రాజానగరం: ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో రాజానగరంలో జరిగిన అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించడం లేదా అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ రాజానగరంలో శుక్రవారం జనసేన, టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారని, ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి జరగలేదని, ఏ ఒక్క పేదవాడికి నివాస స్థలం ఇవ్వలేదని, గ్రామంలో బ్రిటీష్ పరిపాలన జరుగుతుందని నోటికి వచ్చినట్టుగా మాట్లాడారన్నారు. వారందరూ ఒకసారి కంటి వైద్యునికి చూపించుకుంటే బాగుంటుందని దూలం పెద్ద హితవు పలికారు. జగనన్న పాలనలో రాజానగరంలో సుమారు రూ.18 కోట్లతో మూడు గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, పలు ప్రాంతాలలో సీసీ రోడ్లు, పక్కా డ్రైన్లు, ఎస్‌బీఐ, నూకాలమ్మ గుడి సెంటర్లలో కల్వర్టులు నిర్మించామన్నారు. గ్రామంలో 900 మంది పేదలకు నివాస స్థలాలు ఇచ్చామని, సాయిబాబా గుడి వెనుక ఇచ్చిన స్థలాలలో అనేక మంది ఇళ్లు కూడా కట్టుకుంటున్నారన్నారు. దశాబ్దాలుగా ఎవ్వరూ పట్టించుకోకుండా వదిలేసిన రావుల చెరువును పార్కుతో సహా అభివృద్ధి చేశామన్నారు. ఇదంతా కళ్లెదురుగా కనిపిస్తున్నా ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. తాము గడచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ద్వారా జరిగిన అభివృద్ధిని, జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేసి, ఓట్లు అడుగుతున్నామన్నారు. టీడీపీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, వారిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.